క్లుప్తంగా

స్త్రీనిధి రుణాలతో ఆర్థిక స్వావలంబన



రుణాల చెక్కుల్ని పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): స్త్రీనిధి రుణాల సాయంతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం మండలంలోని మల్లవరం గ్రామంలో బుధవారం మహిళలకు స్త్రీ నిధి రుణాలను సర్పంచ్ వాసు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన



దిమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాంబిల్లి : దిమిలిలో బుధవారం విజయ వాహిని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించి తల్లి పాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జి.ఎం.ఎస్.కె.టి. వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు ప్రశాంతికుమారి, వరలక్ష్మి, పోషణ సఖి ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

గణపర్తి ఆరోగ్య కేంద్రానికి బీపీ మిషన్ వితరణ



గణపర్తి ఆరోగ్య సెంటర్‌కు బీపీ మిషన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత సీతారామ్

మునగపాక : చూచుకొండ పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య సెంటర్‌కు బుధవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కాండ్రేగుల సీతారామ్ బీపీ మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం అప్పలనాయుడు పాల్గొన్నారు.

మొదలైన వరి నాట్లు



వరి నారు తీస్తున్న కూలీలు

కోటవురట్ల : మండలంలో ఖరీఫ్ సందడి మొదలైంది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో జోరుగా వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. ముందుగా నారు పోసిన ప్రాంతాలలో వరినాట్లు మొదలయ్యాయి. దాంతో తెల్లవారు జాము నుంచి పల్లెల్లో కూలీల సందడి కనిపిస్తోంది. ట్రాక్టర్లతో దమ్ము పడుతూ, నారు తీస్తూ హడావుడిగా ఉన్నారు. యండపల్లి, జల్లూరు, రాజుపేట, కోటవురట్ల, కైలాసపట్నంలోని పలు ప్రాంతాలలో వరినాట్లు వేస్తున్నారు.

సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన 104 వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. శిబిరానికి డాక్టర్ పవళిక వైద్య సేవలందించారు.

రేపు పంచాయతీ కార్మికుల ధర్నా

అచ్యుతాపురం(అనకాపల్లి): పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 4వ తేదీన కలెక్టర్ ఆఫీసు వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజా సంఘాల సమన్వయ కమిటీ సభ్యుడు కూండ్రపు సోమునాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం అచ్యుతాపురంలో సీఐటీయూ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పునరుద్ధరణ బాటలో..

- పాయకరావుపేట మెయిన్ రోడ్డు అభివృద్ధికి రూ.1.95 కోట్లు విడుదల
- త్వరలోనే పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే బాబూరావు చొరవతో సాకారం



మెయిన్‌రోడ్డులో చేపట్టాల్సిన పనులు పరిశీలిస్తున్న అధికారులు



ఎక్కడికక్కడ గోతులు పడిన పాయకరావుపేట మెయిన్‌రోడ్డు

పాయకరావుపేట : ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చొరవతో పాయకరావుపేట మెయిన్ రోడ్డు మరమ్మతులకు మోక్షం లభించింది. రోడ్డు మరమ్మతులు చేపట్టి పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.95 కోట్లు విడుదల చేసింది. టెండర్లు, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్టు వీఎంఆర్‌డీఏ డీఈ సింగ్ తెలిపారు. బుధవారం ఆయన పాయకరావుపేట వచ్చి గౌతం థియేటర్ సెంటరు నుంచి బైపాస్ వై జంక్షన్ వరకు చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. పాయకరావుపేటలో ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి బైపాస్ జంక్షన్ వరకు సుమారు 2 కిలోమీటర్ల దూరం కలిగిన మెయిన్‌రోడ్డు అధ్వానంగా తయారయింది.

వివరాల్లోకి వెళ్తే నియోజకవర్గకేంద్రమైన పాయకరావుపేటలో ఆర్‌టీసీ కాంప్లెక్స్‌నుంచి బైపాస్ జంక్షన్ వరకు సుమారు 2 కిలోమీటర్ల దూరం కలిగిన మెయిన్‌రోడ్డు అధ్వానంగా తయారయింది. తుని, పాయకరావుపేట జంట నగరాలను కలిపే ఈ ప్రధాన రహదారి ఎక్కడికక్కడ గోతులు పడి ఇరుకుగా తయారయింది. చిల్లర వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈరోడ్డును డబుల్‌రోడ్డుగా విస్తరించి కొత్తరోడ్డు నిర్మించేందుకు గత కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే సుమారు రూ.3 కోట్లు మంజూరు చేసారు. అయితే కాంట్రాక్టర్ కొద్దిమేర పనులు చేసి వదిలేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అంచనాలను రూ.4 కోట్లకు పెంచి ఈ పనులను ఆర్అండ్‌బి నుంచి వుడా (విశాఖపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి)కి అప్పగించారు. కానీ పనులు ప్రారంభించలేదు. తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు కేటాయించింది. అయితే రోడ్డును విస్తరిస్తే చిరు వ్యాపారాలు చేసుకునే తామంతా ఉపాధి కోల్పోతామని, తమకు ఉపాధి కల్పించిన తర్వాతే రోడ్డు విస్తరణ మరమ్మతు పనులు చేపట్టాలంటూ పలువురు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చొరవ తీసుకుని కోర్టు వ్యవహారం కొలిక్కి వచ్చే వరకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ప్రస్తుతానికి రోడ్డు విస్తరణ పెండింగ్‌లో పెట్టి గౌతం సెంటరు నుంచి బైపాస్ వరకు రోడ్లపై గోతులు పూర్తి స్థాయిలో పూడ్చి ప్రస్తుతం ఉన్న రోడ్డు మీదే కొత్త రోడ్డు నిర్మించేందుకు వీఎంఆర్‌డీఏ నుంచి రూ.1.95 కోట్లు మంజూరు చేయించారు. దీంతో వుడా అధికారులు బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు సర్పంచ్ ఉషశ్రీప్రసాద్, ఉప సర్పంచ్ జగతా శ్రీను, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనులతో కలసి రోడ్డు పరిశీలించారు. ప్రసుతం ఉన్న రోడ్డును యథావిధిగా పునఃనిర్మాణానికి మరమ్మతులకు నిధులు విడుదలయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

విత్తనోత్పత్తిపై అవగాహన అవసరం



తెరువుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి విజేత

యలమంచిలి : గ్రామీణ విత్తనోత్పత్తిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయ సంచాలకులు శ్రీధర్, వ్యవసాయాధికారిణి విజేత అన్నారు. తెరువుపల్లి గ్రామంలో బుధవారం రైతులకు విత్తనాలపై అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారిణి విజేత మాట్లాడుతూ రైతులకు ఫౌండేషన్ విత్తనాలు, శ్రీకాకుళం సన్నాలు అందజేశారు. యలమంచిలి వ్యవసాయ సంచాలకులు రవిప్రకాష్ మాట్లాడుతూ విత్తనం ఉత్పత్తి చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గుతాయని అన్నారు. మండల వ్యవసాయాధికారి మోహనరావు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యసాయ సహాయకులు, రైతులు, కౌన్సిలర్ శ్రీను పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో డీఎల్‌పీవో తనిఖీ



పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డీఎల్‌పీవో

నక్కపల్లి : మండలంలో వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను డివిజినల్ పంచాయతీ అధికారిణి ఉదయశ్రీ బుధవారం సందర్శించారు. ఇక్కడ విద్యార్థులకు అందజేసిన ట్యాబులు పరిశీలించారు. డిజిటల్ క్లాసురూంలో విద్యాబోధన పరిశీలించారు. విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇచ్చిన హోం వర్క్‌ను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఈమె వెంట సర్పంచ్ నూకరత్నం పాల్గొన్నారు.

ధార్మిక కమిటీ బలపడాలి



సమావేశమైన సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : ప్రతి గ్రామంలో ధార్మిక కమిటీలు బలబడాలని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ అన్నారు. అచ్యుతాపురం నూకాంబిక అమ్మవారి ఆలయంలో బుధవారం సమరసతా సేవా ఫౌండేషన్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోనూ, రక్షా బంధన్ వేడుకల్లోనూ అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 19న సమరసతా సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కొల్లి అప్పారావు, రెడ్డి అప్పలనాయుడు, బోడపల్లి సత్యం పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



జాతీయ జెండా రూపకర్త వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో పింగళి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని బుధవారం చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.జనార్దన్ పింగళి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జాతీయ జెండాను మూడు రంగులతో రూపొందించారన్నారు. కాషాయం త్యాగానికి, తెలుపు స్వచ్ఛతకు ఆకుపచ్చ సాఫల్యతకు చిహ్నాలు కాగా మధ్యలో ఉన్న అశోక చక్రం ధర్మానికి గుర్తుగా నిలిచాయన్నారు. వెంకయ్యకు వ్యవసాయంపై మక్కువ ఎక్కువన్నారు. కంబోడియా నుంచి పత్తి విత్తనాలను రప్పించి పరిశోధనలు చేశారన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం కూడా ఇతని పరిశోధనలను గుర్తించిందన్నారు. 1906 నుంచి 1922 వరకు జాతీయోద్యమంలో పాల్గొన్నారన్నారు. జెండా వెలుగులోనే స్వాతంత్ర్యాన్ని సాధించుకోవాలని నినదించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు పాల్గొన్నారు.

పాయకరావుపేట : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు, పాఠకులు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఆదర్శనీయుడు పింగళి

మునగపాక : తిమ్మరాజుపేట గ్రామీణ గ్రంథాలయంలో బుధవారం జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం జరిగింది. ముందుగా వెంకయ్య చిత్రపటానికి గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య జీవితం అందరికీ ఆదర్శం కావాలన్నారు. పలు ఉద్యమాల్లో పాల్గొన్న వెంకయ్య చిరస్మరణీయుడన్నారు. అనంతరం జెండాలోని మూడు రంగులకు ఉన్న ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో బుధవారం ఎంపీటీసీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధికి సంబంధించి పెండింగ్ పనులు వేగవంతం చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోజా లక్ష్మి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భజన బృందానికి చీరల పంపిణీ



దాత గొంతిన నాగేశ్వరావు అందించిన చీరలతో పులపర్తి భజన బృందం సభ్యులు

యలమంచిలి : పులపర్తి గ్రామంలో నూకాంబిక కోలాట బృందం సభ్యులకు యలమంచిలి నియోజకవర్గం పులపర్తి గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ వేత్త, నాయకుడు గొంతిన నాగేశ్వరావు చీరలు పంపిణీ చేశారు. పులపర్తి గ్రామంలో నూకాంబిక భజన బృందం ఇటీవలే చుట్టు పక్కల ప్రాంతాల్లో కోలాటం ద్వారా మంచి ప్రదర్శనలు చేసి ప్రజలను ఆకట్టుకున్నారు. దీంతో భజన బృందానికి ఏకరూప దుస్తులు గొంతిన నాగేశ్వరావు ఆర్థిక సహాయంతో అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నూకాంబిక ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఉప సర్పంచ్ దేవర, పాల సంఘం ప్రెసిడెంట్ వెంకటేష్, శ్రీగాకొల్లు వాసు, చినబాబు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫీ'జులుం' అరికట్టాలి



కోన లక్ష్మణ

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల్ని వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. స్థానిక నెహ్రూచౌక్‌లోని తమ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, నిబంధనల ఉల్లంఘన, అర్హతల్లేని సిబ్బందితో బోధన, అనుమతుల్లేకుండా వసతి గృహాలు, కోచింగ్ సెంటర్ల నిర్వహణ తదితర అంశాల్లో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్య, ఆన్‌లైన్ ప్రవేశాలకు సంబంధించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. వీటిపై రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్యకు లేఖలు పంపినట్లు వెల్లడించారు.

ఇంటి వద్దకే సంపూర్ణ పోషణ సరకులు



సంపూర్ణ పోషణ సరకులను అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): గర్భిణులు, బాలింతలకు మంచి పోషకాహారం అందించడమే వైఎస్సార్ సంపూర్ణ పోషణ లక్ష్యమని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) తెలిపారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా బాలింతలకు, గర్భిణులకు నేరుగా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకువెళ్లేవారని దీని వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులు అందజేస్తున్నారని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన సంధ్య, లచ్చన్నాయుడు, కో-ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, దేశంశెట్టి శంకర్‌రావు, పిన్నమరాజువాసు, కూండ్రపు విమలనాయుడు, ద్వారపురెడ్డి బాబ్జి, లాలం శ్రీనివాసరావు, మోటూరి సంజీవి, శనివాడ జువ్వాలనాయుడు, కట్టమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అణుకు గ్రామానికి ప్రత్యామ్నాయ పాఠశాల

కోటవురట్ల : అణుకు గిరిజన గ్రామానికి ప్రత్యామ్నాయ పాఠశాల మంజూరైనట్టు ఎంఈవో రామారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామంలో సర్వశిక్ష అభియాన్ ద్వారా నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రెనింగ్ సెంటర్ (ప్రత్యామ్నాయ పాఠశాల)ను 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ పాఠశాలలో టీచర్ వలంటీర్‌గా పనిచేయడానికి అసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్‌తో పాటు డీఎడ్, డిగ్రీతో పాటు బీఎడ్ చేసిన వారు, అదే పంచాయతీ పరిధిలోని వారు మాత్రమే అర్హులుగా తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 5వ తేదీలోగా ఎంఈవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9441383169, 9704552518 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దోమల నియంత్రణకు చేప పిల్లల విడుదల



మునగపాక శీలప్పన్న చెరువులో చేపలను వదులుతున్న దృశ్యం

మునగపాక : స్థానిక సంతబయిల శీలప్పన్న చెరువులో బుధవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో లార్వా దోమను నిర్మూలించేందుకు గంబూషియా చేప పిల్లలను విడిచిపెట్టారు. అనకాపల్లి జిల్లా మలేరియా అధికారి కె.వరహాలదొర, వైద్యాధికారి విమలగిరి, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గంబూషియా చేప పిల్లలు లార్వాను తినడం వల్ల దోమలు వృద్ధి చెందవన్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు సంభవిస్తాయన్నారు. ప్రజలు దోమతెరలు వినియోగించాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, ఏఎంవో పీజేఎంఆర్‌పీ నాయుడు, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈవో హరికృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు సురేష్, అశోక్, ఉమామహేష్, ఏఎన్ఎం దేవకి, పంచాయతీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి అనుబంధ సంఘాలు కృషి చేయాలి



అనుబంధ సంఘాల సభ్యుల జాబితాలు స్వీకరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో అనుబంధ సంఘ సభ్యుల జాబితాలను ఆయన స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కష్టపడి పనిచేయాలన్నారు. అనుబంధ సంఘాల సభ్యులు ఆయా గ్రామాల్లో పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు జామి రాజు(సింగర్ రాజు), పలువురు సభ్యులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు కీలకం



మాట్లాడుతున్న అనకాపల్లి వ్యవసాయాధికారి తులసి

మునగపాక : వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని అనకాపల్లి జిల్లా రీసోర్స్ ఏవో తులసి కోరారు. తిమ్మరాజుపేటలో బుధవారం రైతులకు గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి వల్ల తెగుళ్లకు దూరంగా ఉండవచ్చన్నారు. భూమిలో జింక్‌లోపం లేకుండా ఉండేందుకు జింక్ సల్ఫేట్ లీటరు నీటిలో రెండు గ్రాముల వంతున పిచికారీ చేయాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీహరి మాట్లాడుతూ మోతాదుకు మించి ఎరువులను వినియోగించడం సరికాదన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, వీఏఏ శ్వేత, సర్పంచ్ భీశెట్టి మంగవేణి కృష్ణారావు, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, ఏఈవో వాణి పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



దిమిలిలో పొలంబడి కార్యక్రమం

రాంబిల్లి : సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు దృష్టి సారించాలని యలమంచిలి ఏడీఏ రవి ప్రకాష్ అన్నారు. దిమిలిలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించరాదని అన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్ మాట్లాడుతూ రసాయన ఎరువులతో పండించిన ఆహారం తినడం ఆరోగ్యం కాదని, నేల స్వభావం కూడా దెబ్బతింటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవోలు సుమంత, విజేత, వీఏఏలు మేఘన, ప్రశాంతి, ఉప సర్పంచ్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

అభిమాని కుటుంబానికి సాయం



శివనాయుడు కుమారుడికి నగదు అందిస్తున్న బృంద సభ్యులు

అనకాపల్లిటౌన్: ప్రజోపయోగ కార్యక్రమాలతో పాటు అభిమానుల కుటుంబాలకు ఏపీ విక్టరీ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ బృందం అండగా నిలుస్తుందని సంఘ వ్యవస్థాపకుడు పి.చందు అన్నారు. యలమంచిలి నియోజకవర్గం తిమ్మరాజుపేటకు చెందిన అభిమాని మళ్ల శివనాయుడు కుటుంబానికి బుధవారం రూ.40 వేలు అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన శివనాయుడు పెద్ద కుమారుడిని ఆస్పత్రిలో చేర్పగా శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న అతనికి తమ వంతు సాయం సంఘ సభ్యులు పలివెల రాంబాబు, గొంతిన వెంకట్, రాయి వెంకటరమణ, సోమేష్, మడగల నరిసింగరావులు అందించినట్టు తెలిపారు.

నేడు సత్తెమ్మతల్లి వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం సుంకరమెట్ట జంక్షన్ సత్తెమ్మతల్లి ఆలయ 32వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ మోహనరావు తెలిపారు. బుధవారం అమ్మవారి ఆలయం వద్ద వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు అమ్మవారికి ఏకాం భజన జరుపుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యదర్శి విల్లూరి త్రినాథ్, కోశాధికారి దాడి వెంకునాయుడు, ఉపాధ్యక్షుడు బుద్ద కిషోర్, మహిళలు పాల్గొన్నారు.

రామాలయం అర్చకులకు స్వాగతం

పాయకరావుపేట : పెదరాంభద్రపురం పంచాయతీ శివారు గ్రామమైన చిన్న నర్సాపురంలో నిర్మించిన సీతారామ ఆలయం అర్చక స్వామి సోళ్ళ రవికి గ్రామస్తులు స్వాగతం పలికారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు సహకారంతో నిర్మించిన ఈ ఆలయంలో అర్చకుడైన సోళ్ళ రవి శ్వేత భవనంలో శిక్షణ పూర్తి చేసుకుని గ్రామానికి వచ్చిన సందర్భంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు తాడి సూరిమూర్తి, ధర్మ ప్రచారక్ కట్టా వీరబాబు పాల్గొన్నారు.

ఓటరు జాబితా లోపాలపై జాగ్రత్త

అనకాపల్లిటౌన్: ఓటరు జాబితా పరిశీలనలో లోపాలుంటే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ సూచించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం రాత్రి బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 251 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, పదిమంది బీఎల్‌వోలకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 21లోపు పూర్తిస్థాయిలో ఇంటింటి ఓటర్ పరిశీలన పక్కాగా నిర్వహించాలన్నారు.